నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

- మక్తల్ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగవంతం చేయాలి
- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

విద్యార్థుల బోధనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 23 : గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్‌లో కొనసాగుతున్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థులకు బోధిస్తున్న తీరు, కేంద్రంలోని వంటగది, నిత్యావసర సరుకులు, గుడ్లను పరిశీలించారు. కేంద్రంలో చిన్నారుల సంఖ్య, మోడల్‌గా ఏర్పాటు చేసిన తర్వాత ఎలాంటి మార్పు వచ్చింది..? వంటి విషయాలను డీడబ్ల్యూవో జయను అడగగా.. ప్రీస్కూల్ ఏర్పాటుతో చిన్నారుల సంఖ్య పెరిగిందని సమాధానమిచ్చారు. మక్తల్ నియోజకవర్గంలో రూ.5 లక్షలతో మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం జాజాపుర్‌లోని అంగన్‌వాడీ ప్రీస్కూల్‌ను సందర్శించి బోధనా సామర్థ్యాలను పరిశీలించారు. కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కేంద్రం వెలుపల చిన్నారులను ఆకర్షించేలా బొమ్మలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, సీడీపీవో వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష..

భూ సేకరణ, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూ సేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ ఎత్తి పోతల-1 కింద 82.35 ఎకరాల భూ సేకరణకు సంబంధించి కోర్టులో డిపాజిట్ చేసిన నష్టపరిహారం డబ్బులు రైతులకు అందాయా..? లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 57.44 ఎకరాల పెండింగ్ భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. కోయిల్‌సాగర్‌కు సంబంధించిన భూ సేకరణలో అవార్డు పూర్తయిందని, డబ్బు కోర్టులో డిపాజిట్ చేశామని అధికారులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల వసతి గృహం పరిశీలన..

అన్ని వసతులతో మెడికల్ కళాశాల వసతి గృహాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలోని బృందావన్ కాలనీలో నిర్మించిన వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. లిఫ్ట్ పనులు పూర్తి చేసి.. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, వసతి గృహం చుట్టూ కట్టుదిట్టమైన ప్రహరీ, యోగా, జిమ్ ఏర్పాటుకు సీసీ స్లాబ్ వేయించాలన్నారు. ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ సరఫరాలో అవాంతరాలుండొద్దు

నీటి సరఫరా వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 23: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. నీటి సరఫరా పైప్‌లైన్‌లో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యనిర్వాక అభియంత కార్యాలయం, మిషన్ భగీరథ ఇంట్రా గ్రిడ్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ కార్యనిర్వహక కార్యాలయాల సిబ్బంది పని తీరును ఉన్నతాధికారులతో తెలుకున్నారు. మిషన్ భగీరథ ఇంజినీర్ ఇంట్రా కార్యాలయంలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ లెబడ్ ప్రమాణాల ప్రకారం రూ.9లక్షలతో ఆధునీకరించిన లేబరేటరీను కలెక్టర్ పరిశీలించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిని, గ్రామ పంచాయతీ రక్షిత తాగునీటిని ఎప్పటికప్పుడు శాంపిల్స్ సేకరించి వాటి నాణ్యతను పరిశీలిస్తున్నామని అధికారులు కలెక్టర్‌కు వెల్లడించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, ఈఈ పుల్లారెడ్డి, ఏఈ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మల్లన్న గుట్టను కాపాడాలి

- కలెక్టర్‌ను కలిసిన కొల్లూరు గ్రామస్తులు

నవాబ్‌పేట, అక్టోబర్ 23: మండలంలోని కొల్లూరు శివారులోని మల్లన్నగుట్టను కబ్జా రాయుళ్ల నుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. కొన్నేండ్ల నుంచి మల్లన్న గుట్టపై కొల్లూరు గ్రామస్తులతోపాటు, వివిధ తండాల ప్రజలు పూజలు చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన నందీశ్వరస్వామి అనే వ్యక్తి ట్రస్ట్ పేరుతో కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాడని వినతిలో పేర్కొన్నారు. గుట్టను కబ్జా కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

జడ్చర్ల అభివృద్ధికి కలిసిరావాలి

- తాగునీటి సమస్య తీర్చడానికే ‘అమృత్ 2.0’
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బూరెడ్డిపల్లి వద్ద శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 23: జడ్చర్ల అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసిరావాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జడ్చర్ల మున్సిపాలిటీలోని బూరెడ్డిపల్లి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో రూ.47కోట్లతో చేపట్టబోయే అమృత్ 2.0పథకానికి సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. అమృత్ పథకం ద్వారా జడ్చర్ల మున్సిపాలిటీలో ఆరు ప్రాంతాల్లో మొత్తం 58లక్షల లీటర్ల సామర్థ్యం గల ఆరు ట్యాంకులను నిర్మించనున్నారు. పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద 5లక్షల లీటర్ల ట్యాంకు, నిమ్మబావిగడ్డ వద్ద 8లక్షల లీటర్ల ట్యాంకు, సిగ్నల్‌గడ్డ వద్ద 15లక్షల లీటర్ల ట్యాంకు, క్లబ్‌రోడ్డులో 10లక్షల లీటర్ల ట్యాంకు, బ్రహంగారి గుడి వద్ద 5లక్షల లీటర్ల ట్యాంకు, జాతీయ రహదారి కావేరమ్మపేట శివారులో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును నిర్మించి.. మొత్తం 66కిలోమీటర్ల పొడవునా తాగునీటి పైప్‌లైన్‌ను నిర్మించనున్నారు. 7,954 కొత్త కనెక్షన్లు ఇవ్వనున్నట్లు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జడ్చర్ల మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పంపుల ఏర్పాటుకు రూ.3కోట్లు నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రూ.47కోట్లతో అమృత్ 2.0 పథకాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో కేంద్రానివి రూ.20కోట్లు, రూ.27కోట్లు రాష్ట్ర ప్రభుత్వానివని వివరించారు. వేసవిలోగా ట్యాంకులతోపాటు పైప్‌లైన్లు పూర్తి చేస్తామన్నారు. అలాగే మున్సిపాలిటీలోని 27వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పనులన్నీ ఓపెన్ టెండర్లతోనే పూర్తిచేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్ సారికరామ్మోహన్, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్ గౌడ్, ఉమాదేవి, చైతన్య, జ్యోతికృష్ణారెడ్డి, మహేశ్, రాజు, రమేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మాజీ చైర్మన్ లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సహాయ పరికరాలు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ధ్రువపత్రాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

దేవరకద్ర, అక్టోబర్ 23: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న అర్హులైన ప్రతి దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి సహాయ పరికరాలు అందజేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వినికిడి లోపం, అంధులకు శారీరక, మానసిక దివ్యాంగులకు సంబంధించిన ట్రైసైకిళ్లు, సహాయ పరికరాలు అందించేందుకు అర్హులైన వారిని గుర్తించేందుకు నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దివ్యాంగులు ప్రతిఒక్కరూ ప్రభుత్వం నుంచి అందించే పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 23: సీసీ కుంట మండలం దమగ్నాపూర్‌కు చెందిన తోకల శశివర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

జీవితంలో బాలికలు, మహిళల పాత్ర ఎనలేనిది

- మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన జడ్జి పాపిరెడ్డి
- జిల్లాకేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 23: ప్రతిపౌరుడి తన దైనందిన జీవితంలో బాలికలు, మహిళల పాత్ర ఎనలేనిదని మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా అటానమస్ డిగ్రీ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా న్యాయమూర్తితోపాటు ఎస్పీ జానకి, జిల్లా న్యాయసేవా ధికార సంస్థ కార్యదర్శి ఇందిర, మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీదేవి, మూడో అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నిహారిక, ఎన్టీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. అనంతరం తెలంగాణ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళల బాధ్యతలు గుర్తించాలన్నారు. జిల్లా న్యాయసేవా ధికార సంస్థ కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ.. అక్టోబర్ 11న నిర్వహించాల్సిన జాతీయ బాలికల దినోత్సవాన్ని పండుగల రీత్యా వీలుకానందున 23న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికల చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో ర్యాలీరూపంలో నినాదాలు చేస్తూ మహిళలు, బాలికల రక్షణ హక్కులపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ జానకి, జడ్జిలు, విద్యార్థులు

రక్తదానం.. మహాదానం

- నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, అక్టోబర్ 23 : రక్తదానం మహాదానమని, ఎలాంటి అపోహలకు గురికాకుండా రక్తదానం చేయాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో పట్టణంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు, యువకులు 35 యూనిట్ల రక్తదానం చేశారన్నారు. అనంతరం రక్తదాతలకు పండ్లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రియాజ్, ఆర్ఐ నర్సింహ, సీఐలు శివశంకర్, రాంలాల్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాములు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

ప్రజలకు మరింత చేరువ కావాలి

ఊట్కూర్(నర్వ)అక్టోబర్ 23: ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్‌లు విధులు నిర్వర్తించాలని, గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన నర్వ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల్లో సీడీ ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సీడీ ఫైళ్ల రికార్డులను పరిశీలించారు. వివిధ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై కుర్మయ్య, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సంగంబండ రిజర్వాయర్‌లో సభ్యత్వం కల్పించాలి

మక్తల్, అక్టోబర్ 23: సంగంబండ రిజర్వాయర్‌లో మక్తల్ పెద్దచెరువు చాపల సంఘం సభ్యులకు సభ్యత్వం కల్పించాలని పెద్దచెరువు సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గంలోని సంగంబండ రిజర్వాయర్‌లో మక్తల్ ప్రాంతంలోని ముదిరాజులకు సభ్యత్వం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా సొసైటీ తరఫున శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మక్తల్ ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సన్మానం

ఊట్కూర్, అక్టోబర్ 23: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేకు ఇటీవల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆఫ్ పాండిచ్చేరి ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ప్రదానం చేయడంపై హర్షం వ్యక్తం చేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రవి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న మక్తల్ ముదిరాజ్‌లు

చెరువులో చేపపిల్లలు విడుదల

నవాబ్‌పేట, అక్టోబర్ 23: మండలంలోని పోమాల చెరువులో బుధవారం జిల్లా మత్స్యశాఖ ఏడీఏ రాధా రోహిణి స్థానిక మత్స్యకారులతో కలిసి చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పోమాల చెరువులో సుమారుగా 10వేల చేప పిల్లలను విడుదల చేసి తెలిపారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ.. మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నరేశ్, నాయకులు యాదయ్య, రాములు, నర్సింహులు, కుమార్, శ్రీశైలం, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


చేపపిల్లలు విడుదల చేస్తున్న ఏడీఏ రాధారోహిణి

ఎంవీఎస్‌లో అంతర్జాతీయ సదస్సు

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 23: పట్టణంలోని క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ‘డా.కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం’ పేరుతో బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డా. యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదస్సులు విజ్ఞానాన్ని విస్తరింపజేసే దిక్సూచీగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమాల్లో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డా.సంధ్యారాణి, కపిలవాయి అశోక్‌బాబు, మనోహర్‌రెడ్డి, రామారెడ్డి, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సదస్సు సంచాలకుడు డా.కృష్ణమూర్తి, అధ్యాపకులు, కపిలవాయి అభిమానులు పాల్గొన్నారు.

శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనపై ఒప్పందం

జడ్చర్ల, అక్టోబర్ 23: జడ్చర్ల డాక్టర్.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై అవగాహన ఒప్పందం జరిగింది. కళాశాల టీఎస్‌కేసీ-టీఎస్‌కే ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి మ్యాజిక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ఒప్పందం ఏర్పాటు చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై కళాశాల ప్రాంగణంలో శిక్షణతోపాటు ఉద్యోగమేళా నిర్వహించి విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, టీఎస్‌కే మెంటర్ వీరప్రతాప్, మ్యాజిక్ బస్ ప్రతినిధి ఫయాజ్ తదితరులు ఉన్నారు.

పారామెడికల్ కోర్సులకు ప్రవేశాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 23 : మెడికల్ కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ రమేశ్ బుధవారం తెలిపారు. కోర్సులు రెండేండ్లు ఇంగ్లీష్ మీడియంలో ఉంటాయని పేర్కొన్నారు. కోర్సు వివరాలు, దరఖాస్తు ఫారం, సీట్ల సంఖ్యను www.tsp mb.telangana.go v.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, డీఎంఎల్‌టీలో 30, డయాలసిస్ టెక్నీషియన్‌లో 10 సీట్లు ఉన్నాయని, ఇంటర్ బైపీసీలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. బైపీసీ అభ్యర్థులు లేకుంటే ఇతర గ్రూపుల విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వచ్చేనెల 6వ తేదీలోగా ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ధ్రువపత్రాల జిరాక్స్‌లతో మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కల్లు రేటు పెంచొద్దు..

మూసాపేట, అక్టోబర్ 23 : కల్లు రేట్లు పెంచొద్దంటూ మండలంలోని జానంపేటలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గురువారం నుంచి కృత్రిమంగా తయారుచేసిన కల్లు సీసా రూ.10 నుంచి రూ.15కు పెంచుతున్నట్లు దుకాణాదారులు చెప్పారు. దీంతో బుధవారం గ్రామస్తులు ఆందోళనకు దిగి.. దుకాణాన్ని బంద్ చేయించారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దుకాణదారుతో మాట్లాడుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

పాటుకాల్వల పరిశీలన

మూసాపేట, అక్టోబర్ 23: సంకలమద్ది శివారు నుంచి కొమిరెడ్డిపల్లిలోని చాకలికుంట వరకు పాటుకాల్వను బుధవారం ఐబీ డిప్యూటీ ఈఈ మనోహర్, ఏఈ తులసీరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ చేస్తున్న కాంట్రాక్టర్లు పీఎం రాజు, బాల్‌రెడ్డిని రప్పించారు. ఈ సందర్భంగా కాల్వకు సంబంధించిన స్లాబ్ వేయడంతోపాటు, పాటుకాల్వను పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయ్య, మదనాపూర్ మార్కెట్ డైరెక్టర్ నిరంజన్, రాంచంద్రయ్య, రమేశ్, ఐబీ వర్ ఇన్‌స్పెక్టర్ చందర్‌నాయక్ తదతరులు ఉన్నారు.

లక్కీడ్రాను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ అర్బన్; అక్టోబర్ 23: డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి లక్కీడ్రా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ రీజినల్ పరిధిలోని 10 డిపోల నుంచి ప్రయాణించిన మహిళా ప్రయాణికులు బాక్స్‌లో వేసిన టికెట్లను బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో లక్కీడ్రా తీయించారు. ఫస్ట్, సెకెండ్ థర్డ్ ప్రైజ్‌లో ప్రయాణించిన ఆరుగురు ప్రయాణికులు, మహబూబ్‌నగర్ డిపోకు సంబంధించి ముగ్గురు ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మ, శారద, డిపో మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు..

మిడ్జిల్, అక్టోబర్ 23 : మండలంలోని మసిగుండలపల్లిలో బుధవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 12 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దంత సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 23: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాలకు చెందిన 20మంది డాక్టర్లు బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. చిగుళ్లు, క్యావిటీస్, ఇతర దంత సమస్యలపై అవగాహన కల్పించారు. వేయి మంది విద్యార్థులకు పైగా దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి పూర్వ విద్యార్థిని డా.వైష్ణవికి పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ జ్యోతీనందన్‌రెడ్డి, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావని, క్యాంప్ ఇన్‌చార్జి షాకీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Gudeballur కి చెందిన E. Thrimurthi Raju S/o Subbaraju, aged 43 years, Occ: agriculture R/o Maruthinagar camp, Gudeballur, Maganoor, Narayanpet Dist. **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్ నగర్ బ్రాంచ్-1 గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్ నగర్ బ్రాంచ్-1 వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.
ఆస్తి వివరాలు: All that the part and parcel of house plot, an extent of 522 Sq.yards in Sy.No.494/2 situated within the limits of Gudeballur Village, Maganoor Mandal, Narayanpet Dist.
హద్దులు : East : Plot of Seethamma, **West:** Plot of Sanyasi Raju, **North:** Way, **South:** Remaining land.
K. CHANDRA MOULI B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Mahabubnagar కి చెందిన Arshad Naveed S/o Late Abdul Rasheed, aged 49 years, Occ: Business R/o H.No.1-4-38/8, New Town, Mahabubnagar **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్ నగర్ బ్రాంచ్-1 గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్ నగర్ బ్రాంచ్-1 వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.
ఆస్తి వివరాలు: All that the part and parcel of house No.1-4-38/8/A, an extent of 175 Sq.yards RCC roof ground floor plinth area 1052 Sft., 1st floor 1052 sft., situated within the limits of opposite to Masjid-e-Saleheen, New Town, Maahabubnagar.
హద్దులు : East : 30 ft road, **West:** House of Merajuddin Sahab, **North:** House of Donor (H.No.1-4-38/8/A/1), **South:** House of Donor (H.No.1-4-38/8).
K. CHANDRA MOULI B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ప్లాటు అమ్మబడును

టీచర్స్ కాలని హౌస్ బిల్డింగ్ కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్, వనపర్తి టౌన్‌కు సంబంధించిన ప్లాటు నెం.96, సర్వే నెంబరు 1136 DTCP Layout కు సంబంధించిన ఈ ప్లాటును సొసైటి వారు అందరి సమ్మతముతో వేలం వేసి అమ్మబడుచున్నది. కావున ఆసక్తి గల వారు తేది 28-10-2024 సోమవారం నాడు ఉ॥ 11-00 గంటలకు వేలం పాటలో పాల్గొనగలరు.
వివరాలకు సంప్రదించండి :
సొసైటి సభ్యులు
9441167447
7702546708
9440737106

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

సౌత్‌జోన్‌కు పీయూ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 23: సౌత్‌జోన్ ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి పీయూ బాస్కెట్‌బాల్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. పీయూలో జరిగిన ఎంపికకు ముఖ్యఅతిథిగా జాయింట్ డైరెక్టర్ డా.భాస్కర్ హాజరై క్రీడాకారులకు సూచనలు చేశారు. బెంగళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు అలీ అబ్దుల్‌బాసిద్, జి.రోహిత్, ఎండీ.అబ్దుల్‌రఫీ, ఎస్.నవీన్ చౌహాన్, గులామ్ మహ్మద్ జిలానీ, షేక్ కైఫ్, కె.సచిన్, జి.అనిల్‌కుమార్, జీఎస్.దిలీప్‌కుమార్, కె.సాయిదీపక్, రియాన్ మహ్మద్‌షేక్, శివకుమార్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీయూ పీడీలు శ్రీనివాసులు, సత్య భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాస్కెట్‌బాల్ కోచ్ ఖలీల్, ఇలియాస్, సిబ్బంది శారద, మన్యం పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టుతో జేడీ, ఫిజికల్ డైరెక్టర్లు

ప్రతిభా విద్యార్థులకు అభినందన

మూసాపేట, అక్టోబర్ 23: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో మూసాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కళ, అంజలి పాల్గొని ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, నేతాజీ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలకు ముడుమాల విద్యార్థులు

కృష్ణ, అక్టోబర్ 23: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు మండలంలోని ముడుమాల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అరవింద్, తరుణ్ ఎంపికైనట్లు ఎంఈవో నిజా మొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. నవంబర్ 4నుంచి 6వరకు జనగామలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ మీనాకుమారి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

మక్తల్, అక్టోబర్ 23: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ బాలికల ఖోఖో పోటీల్లో మక్తల్ మండలం కర్ని జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు శశిరేఖ, శివానీ పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జీహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్ తెలిపారు. 43వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీల ఎంపికకు కృషిచేసిన పీడీ రూపతోపాటు విద్యార్థినులను బుధవారం పాఠశాలలో అభినందించి సన్మానించారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మూసాపేటలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, కర్ని విద్యార్థినులను సన్మానిస్తున్న జీహెచ్‌ఎం